క్లుప్తంగా

పాఠశాలకు రూ.50 వేల విలువైన ఫర్నిచర్ అందజేత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు రామనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఇంకొల్లు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ కరి సుబ్బారావు రూ.50 వేల విలువైన బెంచ్‌లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వర్ణ ప్రభావతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మనం సంపాదించే సంపాదనలో కొంత భాగం సమాజానికి ఉపయోగపడితే సార్థకత ఉంటుందని చెప్పారు. సమాజోపయోగకరమైన పనులు నిర్వహిస్తున్న కరి సుబ్బారావును పలువురు అభినందించారు. దాత ఎన్‌ఆర్‌ఐ కరి సుబ్బారావు మాట్లాడుతూ గుడి గంటల సవ్వడి కంటే బడి గంటల సవ్వడి తనకు ఇష్టమన్నారు. పాఠశాలలను అభివృద్ధి చేయడం ద్వారా పిల్లలు విజ్ఞాన వంతులై సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. ఇంకొల్లు ఉప సర్పంచ్ సయ్యద్ లతీఫ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు షేక్ మస్తాన్ వలి, సీహెచ్ శివరామకృష్ణ ప్రసాద్, దాత బాల్య మిత్రులు షేక్ సర్దార్ బాషా, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వివక్ష లేకుండా పెంచండి



బల్లికురవలో పరీక్షలు చేస్తున్న ఫిజియోథెరపిస్ట్

బల్లికురవ: వైకల్యం కలిగిన చిన్నారులను సాధారణ పిల్లలతో సమానంగా వివక్షత లేకుండా పెంచాలని ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం బల్లికురవలోని భవిత కేంద్రంలో ఏడుగురు చిన్నారులకు పరీక్షలు చేశారు. ప్రతి బుధవారం జరిగే క్యాంపునకు చిన్నారులను తీసుకురావాలన్నారు. మంచి పౌష్టికాహారంతో పాటు నిత్య వ్యాయామం చేయించాలని కోరారు. ఈ పరీక్షల్లో ఐఈఆర్టీలు నాగబాబు, నాజిలి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

చీరాల: వికసిత ఆంధ్రప్రదేశ్ 2024లో భాగంగా బుధవారం చీరాల మండలంలోని అన్ని పాఠశాలలో 6–10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. పోటీలను స్థానిక ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్‌లో నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతిని గిరి వెంకట అనిత, రెండో బహుమతి పీసీహెచ్ శివరాం, మూడో బహుమతిని జి.యశ్విత సాయిలక్ష్మి గెలుపొందారు. వక్తృత్వ పోటీల్లో మొదటి బహుమతిని రేవు హేమ, రెండో బహుమతి ఎం.గీతాలక్ష్మి, మూడో బహుమతి ఎస్.రిషికా గెలుపొందారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభా పోటీల్లో విద్యార్థుల సత్తా




డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థిని

జె.పంగులూరు: మండలంలోని పంగులూరు మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం మండల స్థాయి వికసిత ఆంధ్రప్రదేశ్–2024 అంశంపై రాతపరీక్ష, వక్తృత్వ పోటీలు జరిగాయి. ఎంఈఓలు నాగభూషణం, వీరాంజనేయులు పర్యవేక్షించారు. డిబేట్‌లో బూదవాడ పాఠశాలకు చెందిన జి. మురళీ కృష్ణ సాయిరామ్ ప్రథమ స్థానం, చందలూరు పాఠశాలకు చెందిన చల్లా గాయత్రి రెండో స్థానం సాధించారు. రాత పరీక్షలో మొదటి స్థానం బూదవాడ పాఠశాలకు చెందిన షేక్ సమీరా 10వ తరగతి, రెండో స్థానం కొండమంజులూరు పాఠశాలకు చెందిన సీహెచ్ పవన్ గోపీ కృష్ణ సాధించారు.

విజేతలకు బహుమతుల అందజేత


అద్దంకి రూరల్: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో బుధవారం విద్యార్థులకు వికసిత్ ఆంధ్రప్రదేశ్ పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ బి. సుధాకరరావు బహుమతులు అందజేశారు.



వక్తృత్వ పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థిని



కొప్పరపాలెంలో పూజలు అందుకుంటున్న గణనాథుడు





వేటపాలెం మీదుగా నిమజ్జనానికి తరలి వెళుతున్న గణపతి విగ్రహాలు

జయజయ శుభకర వినాయక

- గ్రామాల్లో ఉత్సాహంగా గణపతి నవరాత్రులు
- ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు
- ఉత్సాహంగా నిమజ్జన ఊరేగింపులు

వేటపాలెం: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు గ్రామాల్లో ఘనంగా జరుగు తున్నాయి. పలు ప్రాంతాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసి చవితి పూజలు చేస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభమై ఐదో రోజుకు చేరడంతో పూజలు చేశారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. మండపాల వద్ద మహిళలు హాతుల సేవల, ఉమాల సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు.

నిమజ్జనానికి తరలింపు..

జై గణేష్.. నినాదాలతో గణపతి విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు ఉత్సాహంగా ఊరేగింపుగా తరలి వెళ్లారు. గులాములు చల్లుకుంటూ ఆనందోత్సాహాల నడుమ గణపయ్య విగ్రహాలను నిమజ్జనం కోసం సముద్రతీరాలకు తరలించారు. భక్తులతో నాలుగు రోజులు ప్రత్యేక పూజలు, అలంకరణలు అందుకున్న గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి మండల పరిధిలోని పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం, రామాపురం సముద్రతీరాలకు నిమజ్జనానికి తరలించారు. యువకులు, మహిళలు, భక్తులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేటపాలెం చుట్టు పక్కల గ్రామాలైన సంతరావూరు, ఇంకొల్లు ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను ట్రాక్టర్లపై వేటపాలెం ప్రాంతాల్లో సముద్రతీరాలకు నిమజ్జనానికి తీసుకొచ్చారు.



చీరాల: వాడరేవు తీరంలో గణపయ్యను నిమజ్జనం చేస్తున్న భక్తులు

చీరాల టౌన్: వినాయకచవితి పండుగ సందర్భంగా చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు ఐదో రోజు బుధవారం నిమజ్జనాలకు తరలివెళ్లాయి. పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నర్సరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను తప్పెట్ల ఊరేగింపుల అనంతరం గంగ ఒడిలోకి వాడరేవు తీసుకువచ్చి నిమజ్జనం చేస్తున్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథులను వాడరేవులోని సముద్రంలో నిమజ్జనం చేస్తుండగా తీరంలో నిమజ్జనాల సందడి నెలకొంది. నిమజ్జనాల సందడి నేపథ్యంలో సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు.



సముద్రతీరంలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న యువకులు

బల్లికురవ: గణపతిని ఆరాధిస్తేఅన్ని శుభాలే జరుగుతాయన్న నమ్మకంతో వాడవాడలా ఐదు రోజులుగా గణపతి నిలువెత్తు విగ్రహాలకు విశేష పూజలు చేస్తున్నారు. బుధవారం కొప్పరపాలెం, వేమవరం, కె. రాజుపాలెం, కొణిదెన గ్రామాల్లోని నిమజ్జనాలు చేశారు. బల్లికురవ ఎస్సై జీవీ చౌదరి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.



కారంచేడులో 108 బెల్లం అచ్చులతో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు మస్కో బజారులో ఏర్పాటు చేసిన గణపతి పందిరిలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మాధవస్వామి దేవాలయం అర్చకులు వేదాంతం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ యూత్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ పందిరిలో గణనాథుని 16 సంవత్సరాలుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గణపతి నవరాత్రుల్లో భాగంగా స్వామి వారికి భక్తులు 108 బెల్లపు పలకలు (అచ్చులతో) ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అత్యంత ప్రీతికరమైన బెల్లంతో పూజలు చేస్తే తమ కోరికలు నెరవేరుస్తారని భక్తుల విశ్వాసం. దీంతో పెద్ద ఎత్తున భక్తులు ఈ బెల్లాన్ని సిద్ధం చేశారు. అనంతరం భక్తులకు కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చినగంజాం: వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండలంలో బుధవారం భారీగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండలంలోని సోపిరాల, రాజుబంగారుపాలెం, మూలగానివారిపాలెం, మున్నంవారిపాలెం తదితర గ్రామాలకు చెందిన వినాయక విగ్రహాలను ఊరేగింపుగా సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. మండలంలోని మోటుపల్లి, పల్లెపాలెం, పెదగంజాం గ్రామాల్లోని సముద్ర తీరంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 30 విగ్రహాలకుపైగా నిమజ్జనానికి తరలించారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఊరేగింపు కార్యక్రమంలో బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ డీజే సౌండ్స్‌తో కొనసాగించారు. భక్తులు విశేషంగా పాల్గొని ఆయా సముద్ర తీరాల్లో స్నానాలు ఆచరించారు. మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు



పౌష్టికాహారంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కారంచేడు: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారంను ఎలా ఇంటి వద్దే సిద్ధం చేసుకోవచ్చని ఐసీడీఎస్ కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్ హిమబిందు అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రమైన కారంచేడులో సెంటర్ నంబర్ 10లో ఏర్పాటు చేసిన పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొని గర్భిణులు, బాలింతలు, సాధారణ స్త్రీలు తీసుకోవాల్సిన ఆహార నియమాలు వివరించారు. ఆకు కూరలు, కోడిగుడ్లు, పాలు, చిక్కీలు వంటివి తరుచూ తీసుకోవాలన్నారు. అనంతరం ఆమె గర్భిణులు, బాలింతలతో మంచి రుచి, పౌష్టికాహారం కలిగిన వంటల పోటీలను పెట్టి మంచి ఆహారం వండిన మహిళలను ఆమె అభినందించారు. సుమలత, ఎన్ఎమ్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

చీరాల అర్బన్: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యం పెంపొందుతుందని ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ఉమ అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని తూర్పుకాపుల వీధి, ముస్లిం ఏరియా, గంజిపాలెం, గంగమ్మ గుడి, గంజిపాలెం–2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. సూపర్వైజర్ కుముద్వతి, ఏఎన్ఎం పి.బ్యూలా, మహిళా పోలీస్ రాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ గంగాభవాని, ఎన్.గాయత్రి, ఎస్‌కే పర్విన్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

జె.పంగులూరు: గర్భిణులు, బాలింతలు పుష్టికరమైన ఆహారం తీసుకోవాలని, కొరిశపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ కృష్ణకుమారి కోరారు. మండలంలోని రామకూరు గ్రామంలో బుధవారం మాట్లాడారు. ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు తులసి, అనురాధ, ఆరుణ, శ్రీ లక్ష్మీ, సుజాత, తల్లులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

చీరాల రూరల్: పట్టణంలోని ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు దేవకి సుబ్బారావు పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆర్థిక సహకారంతో పట్టణంలోని ఎస్‌ఏఆర్ఎం హైస్కూల్‌లో విద్యార్థులకు రూ.7500 విలువ గల నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, స్టీల్ ప్లేట్లు, బిస్కెట్ ప్యాకెట్లును బుధవారం అందించారు. ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, సీహెచ్ గురుప్రసాద్, దేవకి సుబ్బారావు, గొడవర్తి సుధాకరరావు, నారాయణ, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా పోటీలకు చీరాల విద్యార్థులు



టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చీరాల: శ్రీకాకుళంలో ఈనెల 14న జరిగే అంతర్ జిల్లా సబ్ జూనియర్స్ టెన్నికాయిట్ పోటీలకు బాపట్ల జిల్లా నుంచి నలుగురు బాలికలు ఎంపిక య్యారు. ఈ మేరకు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడివలస దేవరాజు, జిల్లా కార్యదర్శి అనపర్తి అలేఖ్య తెలిపారు. బుధవారం చీరాల్లోని పెరీరా ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో జరిగిన పోటీల్లో నలుగురు బాలికలు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారు శ్రీకాకుళం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. పెరీరా స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రసన్న, వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా తెలంగాణ మద్యం విక్రయం

మార్టూరు: మండలంలోని కోలలపూడిలో రెండో రోజు బుధవారం కూడా అక్రమ మద్యం వ్యాపారం జోరుగా సాగింది. గ్రామానికి చెందిన వ్యాపారి సోమవారం రాత్రి తొమ్మిది మద్యం కేసులు తనకు చెందిన ఓ షెడ్డులో ఉంచి మంగళవారం ఐదు కేసులు విక్రయించాడనే వార్త బుధవారం ‘సాక్షి’లో వచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం గ్రామంలో విచారించిన విలేకరులకు సదరు వ్యాపారి గ్రామంలో దించింది తొమ్మిది కేసులు కాదని 40 కేసులని తెలిసింది. సదరు వ్యాపారి పరిసర గ్రామాల్లో అక్రమ మద్యం వ్యాపారం నిర్వహించే వారికి ఫోన్ చేసి మరీ తన దగ్గర ఉన్న మద్యం కేసులను ఒక్కొక్కటిగా విక్రయించటం గమనార్హం. అంతేగాక గత రాత్రి వరకు తనకు చెందిన షెడ్డులో నిల్వ ఉంచిన మద్యం కేసులను దాడులకు భయపడి అతను తమ సమీప బంధువుల నివాసాలకు తరలించినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం.

రాగివైరు చోరీపై కేసు నమోదు

అద్దంకి రూరల్: మండలంలోని పలు గ్రామాలోని పొలాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లలోని రాగి వైరు చోరీ జరిగిందని బుధవారం ఏఈ శివప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు. గోపాలపురం, శాంతినగర్, చిన కొత్తపల్లి గ్రామాల్లో సుమారు 20 వేలు విలువగల రాగి వైరు దొంగిలించినట్లు ఎస్సై తెలిపారు.

గోవధ అరికట్టాలి

చీరాల అర్బన్: గోవులను సంరక్షించడం విధిగా అందరూ భావించాలని, గోవులను హింసించడం మానుకోవాలని ఆధ్యాత్మిక గురువు అరుణకృష్ణ రాజర్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవులను దేవతలుగా పూజించడం మన సంప్రదాయమన్నారు. పలు చోట్ల గోవులను అక్రమంగా కబేళాలకు తరలిస్తుండడం బాధాకరమన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



సరుకులను వరద ముంపు ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం



వాహనాన్ని విజయవాడకు పంపుతున్న సంస్థ ప్రతినిధులు



ఎంపీడీవోకు డీడీ అందజేస్తున్న రాయల్ స్కూల్ యాజమాన్యం

పర్చూరు (చినగంజాం): పర్చూరు రోటరీ క్లబ్ సభ్యులు బుధవారం కృష్ణా జిల్లాలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు. రేపల్లె ప్రాంతంలోని బొబ్బర్లంక, మైనేనివారిపాలెం, పెనుమూడి, పల్లెపాలెం గ్రామాలను సందర్శించి బాధితులను ఆదుకున్నారు. వరద బాధితులకు నిత్యావసరాలు, దుప్పట్లు, టవల్స్‌తో కూడిన 100 కిట్లను అందజేశారు. రూ.లక్ష విలువైన 100 కిట్లను బాధితులైన పేదలకు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అన్నారు. రోటరీ జిల్లా 3150 తరఫున రూ.50 లక్షల విలువైన 5 వేల కిట్లను అందించినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. నాగభైరు శ్రీనివాసరావు, పాటోలు ఉదయభాస్కర్, కోట శ్రీనివాసరావు, ఆయా గ్రామాల పెద్దలు, బాధితులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

మార్టూరు: వరదలతో అతలాకుతలమై వీధిన పడిన అన్నార్తుల కోసం మార్టూరులోని రాయల్ స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు తమ సాయం అందించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం తమ వంతు సాయంగా రూ.1.20 లక్షలు వసూలు చేశారు. వసూలైన మొత్తాన్ని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో పాఠశాల డైరెక్టర్ పి.రవీంద్రబాబు ఇన్‌చార్జ్ కె.మధుబాబులు ఎంపీడీవో జి. నితిన్కు ఆయన కార్యాలయంలో అందజేశారు. వరద బాధితుల కోసం పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించిన రాయల్ స్కూల్ యాజమాన్యాన్ని, విద్యార్థులను ఎంపీడీవో నితిన్ ఈ సందర్భంగా అభినందించారు.

సమాజ సేవలో మానవతా స్వచ్ఛంద సంస్థ ముందంజ

పర్చూరు (చినగంజాం): మానవతా స్వచ్ఛంద సంస్థ సమాజ సేవకు ముందుంటుందని సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున వరద బాధితుల సహాయార్థం బుధవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. దాతల సహకారంతో రూ.లక్షల్లో నిధులు సేకరించి పది హేను రకాల నిత్యావసర వస్తువులు, చీరలు, దుప్పట్లు విజయవాడ శాంతి నగర్‌లో వరద బాధితులకు అందించారు. కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రజలకు, పేదలకు కష్టకాలంలో తోడు ఉంటుందని, సమాజానికి అనేక సేవా కార్యక్రమాలు అందిస్తుందన్నారు. సంస్థకు ఎంతో మంది దాతలు మేము సైతం అని ముందుకు వస్తున్నారన్నారు. బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వారు రూ.3.5 లక్షలు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి రూ.2 లక్షలు మానవత సంస్థకు అందించారన్నారు. చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ ఈ రోజు చాలా పవిత్రమైన రోజని, అభాగ్యులకు చేయూతను అందిస్తున్నామని, వచ్చే ఆదివారం మానవత సంస్థ ఆధ్వర్యంలో భారీ మెడికల్ క్యాంపు, విద్యాభివృద్ధికి ల్యాప్ టాప్‌లు, డిజిటల్ క్లాసులకు ఎల్ఈడీ టీవీ అందిస్తామని చెప్పారు. సెక్రటరీ సతీష్, ట్రెజరర్ సాయిరాం, డైరెక్టర్‌లు శివాజీ, మిత్ర, సుబ్రహ్మణ్యం, సాంబశివరావు, మేనేజర్ సాయి కిరణ్, సుధాకర్, ఆనందరావు, సురేష్, లక్ష్మీనారాయణ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



వరద బాధిత ప్రాంతాల్లో నిత్యావసర కిట్లు అందజేస్తున్న రోటరీ సభ్యులు

వరద బాధితులకు సరుకుల పంపిణీ

చీరాల అర్బన్: వరద ముంపునకు గురైన జిల్లాలోని లంక ప్రాంతాలకు రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో రోటరీ ఆపద్బంధు పథకం ద్వారా రూ.2.75 లక్షల విలువ గల 12 రకాల నిత్యావసరాల 300 కిట్లు బుధవారం ప్రత్యేక వాహనం ద్వారా తరలించారు. లంక గ్రామాలైన రావి అనంతవరం, బొబ్బరలంక, పెనుమూడి, పల్లెపాలెంలో సోప్స్, దుప్పట్లు, టవల్స్, మెడిసిన్స్ వంటివి అందిస్తారు. చందలూరి బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, కరణం శ్రీనివాసబాబు, డాక్టర్ ఐ.బాబూరావు, వలివేటి మురళీకృష్ణ రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి

అద్దంకి: ఆడపిల్లల చదువు ఇంటికే వెలుగు అని చీరాల ఉప విదాయశాఖాధికారి అబ్బరాజు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తిమ్మాయపాలెంలోని జిల్లా పరిషత ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆడపిల్లల చదువు ఆవశ్యకతను గురించి వివరించారు. మండల విద్యాశాఖ అధికారి –2 బి. సుధాకర్ రావు, హెడ్మాస్టర్లు శ్రీనివాసరావు, ఊటుకూరు శ్రీనివాసులున్నారు.

బెదిరింపులపై కేసు నమోదు

అద్దంకి రూరల్: తమ చెల్లికి అన్యాయం జరిగిందని నష్ట పరిహారంగా భారీ నగదు ఇవ్వకుంటే చంపుతామంటూ ఆమె అన్నలు వచ్చి ఆమె అత్తామామలను బెదిరించారు. ఈఘటనపై బుధవారం రాత్రి ఎస్సై ఖాదర్ బాషా కేసు నమోదు చేశారు. అద్దంకి మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పల్లపు వెంకటరత్నం, రామారావు కుమారుడు అంకమ్మరావుకు 2016లో వినుకొండకు చెందిన రాధికతో వివాహం అయింది. వీరికి ఒక బాబు ఉన్నాడు. ఈక్రమంలో ఇద్దరికి రెండు సంవత్సరాల నుంచి మనస్పర్థలు రావడంతో వేరుగా ఉంటున్నారు. సోమవారం రాత్రి రాధిక అన్నలతో పాటు వారి అమ్మ కూడా గోపాలపురం వచ్చి రూ. 20 లక్షలు నగదు ఇచ్చి విడాకులు ఇవ్వాలని బెదిరించి దాడికి దిగారు. స్థానికులు రావడంతో అక్కడ నుంచి వెళ్లి పోయారు. హైదరాబాద్‌లో ఉన్న అంకమ్మరావును పిలిపించి బుధవారం ఫిర్యాదు చేశారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి దేవస్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి విరాళం అందింది. ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం కొలచనకోట గ్రామానికి చెందిన, బత్తిని వెంకటప్పయ్య, బుల్లెమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రసాద్ భార్య నిర్మల రూ. 2,25,116 లను దేవస్థాన ఏసీ సుభద్రకు బుధవారం అందజేశారు.

రంగనాయకుల స్వామి సేవలు మరువలేం



రంగనాయకులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న జంజనం శ్రీనివాసరావు, చేనేత నాయకులు

చీరాల టౌన్: దేశ స్థాయిలో మొట్టమొదటగా పద్మశాలీలకు అఖిలభారత పద్మశాలి సేవా సంఘాన్ని ఏర్పాటు చేయడంతో పాటు చేనేతల అభివృద్ధికి, సంక్షేమానికి ఆకురాతి రంగనాయకులు స్వామి చేసిన సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు కొనియాడారు. అఖిల భారత పద్మశాలియ సంఘ ప్రథమ అధ్యక్షుడు ఆకురాతి రంగనాయకులు స్వామి జయంతిని పురస్కరించుకుని బుధవారం ఈపురుపాలెం మార్కెట్ వద్ద ఉన్న రంగనాయకులు విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం మాట్లాడుతూ అఖిలభాతర పద్మశాలి సంఘాన్ని 1921 జూన్ 21న కడపజిల్లా పుల్లంపేటలో ఏర్పాటు చేశారని దేశస్థాయిలో మొట్టమొదటగా ఏర్పాటు చేసిన చేనేత సంఘానికి ఆకురాతి రంగనాయకులు వ్యవస్థాపకులుగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ ఆకురాతి పద్మిని, మాజీ సర్పంచ్‌లు జి.సరోజిని, పాలపర్తి నాగేశ్వరరావు, చేనేత నాయకులు దామర్ల శ్రీకృష్ణ, ఎం.వెంకటరావు, కూరగాయల మార్కెట్ వ్యాపారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

12న సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభం

అద్దంకి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సూపర్ లగ్జరీ బస్సులను ఈ నెల 12న ఉదయం 8 గంటలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ రామమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు నడుపుతున్న పాత బస్సుల స్థానంలో నడపనున్నట్లు తెలిపారు.

ఇ- పంట నమోదు చేసుకోండి



ఇ- పంట నమోదులో వ్యవసాయాధికారి

అద్దంకి రూరల్: ఈనెల 15వ తేదీ లోపు ఇ- పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ బుధవారం తెలిపారు. కుంకుపాడులో నమోదు పరిశీలించారు. ఫసల్ బీమా, గిట్టుబాటు ధర, పంటల బీమా ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నావడ్డీ పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

14న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 14న స్థానిక రోటరీ క్లబ్‌లో గురుపూజోత్సవంలో భాగంగా పది మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం చేయనున్నట్లు ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల బ్రహ్మరెడ్డి, వడలి రాధాకృష్ణ బుధవారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరవుతారన్నారు. ఆత్మీయ అతిథులుగా ఏపీ, తెలంగాణ హైకోర్టు క్రిమినల్ లాయర్ కట్టా రాజేశ్వరి, డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, 18వ వార్డు కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య హాజరవుతారన్నారు. చీరాల పరిసర ప్రాంతాల్లోని పది మంది ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.